విశ్వసుందరి

శ్రీ K. V. సుబ్బారావు బి. ఏ.

(గత సంచిక తరువాయి)

గంధర్వకన్య పద్మం దిగి ఒడ్డుకువచ్చి మాణిక్య హారాన్ని యువకుని మెడలో వేసింది. "సాహస వంతుడవంటే నీవేనయ్యా. నీ అద్భుత సాహసానికి యిదేనా జోహార్! ఫో. గడువులోపల చేరి నీ యీ కానుక చెల్లించు. ఈ మాణిక్యహారం మెడలో ఉన్నంతకాలం వ్యాధులు వెన్నంటవు. దీన్ని ధరించినవారు నిత్యయవ్వనవంతులుగా వుంటారు. ఇదే యీ హారంలోవున్న ప్రత్యేకత" అంది.

"సెలవు" అని అంటుండగా చెలికత్తెవచ్చి, "మరి ఆ కానుకతోనే తృప్తిపొందుతున్నారు. వెలలేని యీ గంధర్వ కన్యను ఎప్పుడు పరిణయమాడుతారు" అంది. గంధర్వకన్య సిగ్గుతో తలవంచుకుంది. చెలికత్తె సాక్షిగా గాంధర్వవిధిన వివాహం జరిగిపోయింది.

"ఇదిగోండి. యీ వజ్రాల వుంగరం. దీనిని నేలమీద రాసినప్పుడు నేను ప్రత్యక్షమాతాను" అని వుంగరాన్ని భువనసుందర్ వ్రేలికి తొడిగింది.

భువన సుందర్ గంధర్వకన్యవద్ద సెలవుతీసుకొని తృటిలో నీల వేణి నగరానికి వచ్చాడు. రాజప్రాసాదంలో అడుగుపెట్టి, "యిదిగో మీరు కోరిన మాణిక్యహారం" అంటూ ఆమె మీదికి విసిరాడు. కాని ఆ మాణిక్యహారం ఆమెమీదపడలేదు. సరాసరివచ్చి విశ్వసుందరి మెడలో వ్రాలింది. ఈ అవమానానికి మణికర్ణికకు మిగుల కోపంవచ్చింది. విశ్వసుందరి మెడలోనించి తీయబోయిందికాని హారం రాలేదు పైపెచ్చు రాణి చేతులు వుండ్లుపడినయ్.

"నేనెప్పుడు కుత్సితుల కంఠాన వుండను. సత్సంపన్నుల కంఠమే నాకు నిలయం" అని చెప్పింది మాణిక్యహారం.

రాణి చేసేదిలేక నోరు మూసుకుని కూర్చుంది.

"సరే నా రెండవ ప్రశ్న విను. ఈ వస్తువును ఐదురోజుల్లోనే సాధించాలి. ఇక్కడికి ఈశాన్య దిశలో నీలపుకొండల నడుమ పెద్ద పుట్టవుంది. ఆ పుట్టలో నాగమాత సిరస్సున ధరించిన నాగమణిని సాధించుకురావాలి" అంది. "ఈ సారి తప్పకుండా భువనసుందర్‌ను నాగుపాములు చంపేస్తాయని ఆమె గాఢ నమ్మకం. దానితో తన పీడ వదులుతుంది, అనుకొన్నట్లు తమ్ముడికి అంటగట్టవచ్చును" అని కుతూహలపడసాగింది రాణి.

కాని భువనసుందర్ అంత తేలికమనిషి కాడు. కార్యాన్ని సాధించి తీరుతాడని ఇంకా ఆమెకు తెలీదు. వెంటనే భువనసుందర్ రాణివద్ద సెలవు తీసుకొని రాజప్రాసాదం బయటకు వచ్చేశాడు.

3

రాజభవనాన్నుండి సరాసరి ఈశాన్య దిక్కుకే ప్రయాణం సాగించాడు. పదిహేను మైళ్ళపైబడి వెళ్ళినతర్వాత నీలపు కొండలు కనిపించినయ్. అయితే నీలపు కొండలను ఎక్కడం ఇతర కొండల నెక్కినంతసాధ్యంకాదు. మూడు మెట్లు ఎక్కితే నాలుగు మెట్లు వెనక్కు నెట్టేస్తుంది. అయినా భువన సుందర్ సాహసించాడు. నెమ్మదిగా కొండలనెక్కి ఎలాగయతేనేం కొండలనడుమ ప్రదేశానికి వచ్చేశాడు.

మణికర్ణిక చెప్పినట్లు కొండలనడుమ కఒ పెద్ద పుట్టవుంది. ఆ పుట్టకు ఒకటే ఒక కలుగు. కలుగును తేరి పార జూశాడు. కలుగులోనుండి లోపలకు మట్టిమెట్లు అగుపించినయ్. నెమ్మదిగా సద్దుచేయకుండా మెట్లగుండా లోపలకు వెళ్లాడు. కాని అలా వెళ్లి వెళ్లి చివర మెట్టుదగ్గరకు వచ్చాడు. కాని ఆ మెట్టుజారింది. భువనసుందర్ సరాసరి పోయి పోయి ఒక నాగుపాము నోట్లోపడ్డాడు. ఎప్పుడయితే నోట పడ్డాడో ఆ క్షణంలోనే నాగుపాము గుటుక్కుమనిపించింది భువనసుందర్‌ను.

భువనసుందర్ కాస్తా నాగుపాము నోట్లోవుండి పోయాడు. ఐతే భువనసుందర్ ఎలా నాగుపాము నోట్లోనుంచి తప్పించుకోవాలా అని ఎత్తులు వేస్తూనే వున్నాడు. చివరికో వుపాయంతట్టింది. వెంటనే మొలలోంచి కత్తితీసి నాగుపాము కడుపుచీల్చటం మొదలెట్టాడు. నాగుపాము కత్తిపోటులకు తాళలేక భువనసుందర్‌ను కాస్తా బయటకు కక్కేసింది. ఈ వుపాయంతో భువనసుందర్ బుడుంగుమని బయటకొచ్చేశాడు,

"నీవు ఏమి పనిమీదవచ్చావ్?" అని అడిగింది నాగుపాము.

"నాగమణికోసం వచ్చాను. అదెక్కడుందో చెప్పు?" అంటూ గద్దించాడు.

"పిచ్చివాడా! నన్ను భయపెట్టినంత సులభంగా నాగమణిని సంపాదించలేవోయ్. అయినా నాగమణి నావద్దలేదు. దానిని సంపాదించవలెననుకుంటే నీవు లోకోత్తరమయిన ఘనసాహసం చేయాలి." అంది.

"అయితే ఆ సాహసమేమిటో చెప్పు. ఏకష్టానికయినా వెనుకదీయను; కార్యాన్ని సాధిస్తానూ!" అన్నాడు.

"సరే పద. నిన్ను నాగమాత దగ్గరకు తీసుకెళ్తాను. అక్కడకాని నీరంగు తేలదు." అని భువనసుందర్‌ను నాగమాత దగ్గరకు తీసుకెళ్ళింది.

నాగమాత యితన్ని చూచి "ఎవరునువ్వు?" అని గర్జించింది.

భువనసుందర్ వినమ్రుడయి ఆమెకు నమస్కరించి తన పేరు చెప్పునని, తాను వచ్చిన యావద్వృత్తాంతం చెప్పాడు.

"నాగమణిని సంపాదించవలెనని వచ్చిననీబోటి యువకులనేకమందిని చూశాను. కాని ఆ యువకులంతా నా పరీక్షకు తాళలేక బుగ్గి అయిపోయారు. సాహసంలేకుండా ముందడుగు వేశావా నీగతీ అంతే." అంది నాగమాత.

"సాహసించే వచ్చాను నేను. ఆ సాహసమేమిటో చెప్పండి. ప్రాణాలకయినా వెనుతీయక సాధించితీరుతాను" అన్నాడు.

"భేష్ నీ ధైర్యమే చెపుతుంది, నీవు అపజయానికి శత్రుడవని. ఇక్కడకు పడమరగా ముత్యాల సముద్రంవుంది. ఆ సముద్రంలో ఒక వింతచేపవుంది. ఆ చేపపేరు 'నల్లచేప' నీవు సముద్ర గర్భంలోకి పోయి 'నల్లచేప'ను బయటకు తీసుకురావాలి. అలా ఆ చేపను బయటకీడ్చుకొచ్చావా నీకు నాగమణి దక్కుతుంది. లేక ఒట్టిచేతులతో వచ్చావా నీ శిరస్సు నాకు దక్కుతుంది. 'నల్లచేప' నాకు బద్ధశత్రువు. దాన్ని పట్టెయ్యాలి. పో!" అంది నాగమాత.

"సరే యీ సాయంత్రానికల్లా మీకు 'నల్లచేప'ను పట్టించి తీరుతాను" అని సరాసరి పడమరగా బయలుదేరి సముద్రపు ఒడ్డుకు వచ్చాడు. నిజంగా అది ముమ్మూర్తులా ముత్యాల సముద్రమే. ముత్యాలన్ని అలలమీద తేలియాడుతున్నయ్. ఎక్కడ చూసినా ముత్యాలమయం. సముద్రంలో చేపపిల్లలన్ని ముత్యాలగొళ్లు కట్టుకొని ఆడుకుంటున్నయ్. ఆ వింతలనుచూస్తూ కాలాన్ని విషయాన్ని మరచిపోయాడు. కాని కాస్సేపటికల్లా అసలు విషయం గుర్తుకు వచ్చింది. సముద్రంలోకి ఎలా వెళ్లటమో అర్థంకాలేదతనికి. ఇంతలో అతనిచేతి వుంగరం ఒక

రాయికి తగిలింది. వెనువెంటనే గంధర్వకన్య ప్రత్యక్షమైంది.

"ఏం కావాలీ నీకూ?" అని అడిగిందినవ్వుతూ భువనసుందర్ అసలు విషయం చెప్పాడు.

"ఓస్ ఇంతేకదా. మరేంకంగారుపడకు," అని ఒకశ్యామగుళికను అతనికిచ్చి దీన్ని నోట్లో వేసుకొని సముద్రంలో మునుగు. 'నల్లచేప'ను బయటకు లాగటానికి యిది వుపాయం. ఎందుకంటే యీ శ్యామగుళికను నోట్లోవేసుకుని నీటిలోదిగిన మరుక్షణం చేపగా మారిపోతావు. బయటకురాగానే యీగుళికను సముద్రంలోపారేయ్. బయటకొచ్చిం తర్వాత క్షణం నీ దగ్గరవుంచుకున్నావా కీడుమూడుతుంది" అని చెప్పి మాయమైంది.

గంధర్వకన్య ఇచ్చిన శ్యామగుళికను నోట్లోవేసుకొని సముద్రజలంలో మునిగాడు. తక్షణమందే చేపగా మారిపోయాడు. ఎక్కడలేనిబలం తెచ్చుకొని 'నల్లచేప'నుపట్టి ఒడ్డుకు యీడ్చుకువచ్చి దాన్ని మండే ఇసుకలో వేశాడు. బయటకొచ్చి గుళికను తీయగానే మామూలు మనిషి అయ్యాడు. గంధర్వకన్య చెప్పినట్లు ఆ గుళికను సముద్రంలో పారవేశాడు. కాని తక్షణంలోనే సముద్రమంతా ఫెళఫెళామని వుడికిపోయింది. ఆవిరిగా మారిపోయింది నీరంతానూ. నీరంతా మాయమై సముద్రం నిండా ముత్యాలు మిగిలినయ్. ఆ వింతను చూస్తూ అలానే నిలుంబడిపోయాడు భువనసుందర్.

ఇంతలో భువనసుందర్ వెనక్కు తిరిగి చూడగానే నాగమాత నవ్వుతూ కనిపించింది. "ఇంత ధైర్యవంతుడివి! నిన్ను ఒక్కడినే చూశానోయ్" అని నవ్వింది. వెంటనే నాగమాత చేపకడుపును జాగ్రత్తగా బ్రదలు చేసింది. ఆశ్చర్యం! ఆ చేపకడుపులోనుంచి పదహారేళ్ళ బాలిక నవ్వుకుంటూ బయటకొచ్చి నాగమాతను కౌగిలించుకుంది. నాగమాత ఆమెను ముద్దుపెట్టుకొని ఎదకు హత్తుకుంది.

నాగమాత భువనసుందర్ వయిపు తిరిగి యిలా అంది:

"ఇదంతా నీకు వింతగావుందికదూ నాయనా. ఈ బాలిక నా కూతురు. దీనిపేరు నాగసుందరి. ఇది ఒకసారి సముద్ర తీరంలో ఆడుకుంటుంటే దీన్ని 'నల్లచేప' మ్రింగి సముద్ర గర్భంలోకి పారిపోయింది. నా బిడ్డను వెలికి తెచ్చుకుందామని ఎంత ప్రయత్నించినా నాకు చేతకాకపోయింది. సామాన్య మానవుడవు. నీవు నా బిడ్డను కాపాడగలిగావ్. పైగా నీళ్లను ఆవిరిచేసి సముద్రమంతా రత్నాలమయం చేయగలిగావ్. నీ బోటి అద్భుత యువకునకు నా కూతుర్నిచ్చి వివాహంచేయటంకంటే నాకు కావలసిందేముంది? ఈ రాత్రి మీ యిద్దరికి పెండ్లిచేసి రత్నరాసుల నివ్వటమే కాకుండా నీవు కోరిన నాగమణినికూడా ఇస్తాను" అంది.

భువనసుందర్ సంతోషానికి అంతులేదు. ఆ రాత్రి వైభవంగా నాగసుందరి భువనసుందర్ల కల్యాణం జరిగింది. భువనసుందర్ తనకు కలిగిన అదృష్టానికి పొంగిపోతాడు.

పెండ్లి అయింది. ఒక రోజు భార్యతో కులాసాగా గడిపాడు. "ఇక వస్తాను" అని అంటుంటే నాగసుందరి కంట నీరు పెట్టింది.

"రాణి మూడవ వసువుకూడా సాధించి నిన్ను తీసుకువెడతాను సరేనా" అని జవాబిచ్చాడు భార్యకు.

ఇంతలో నాగమాతవచ్చి "నాగమణి"ని అతని చేతుల్లో పెట్టింది. ధగధగా వెలిగిపోతూంది ఆ మణి

"భువనసుందర్! యీ మణి సామాన్యమైనదిగా తలచకు. ఇది అత్యద్భుతమైంది. ఇది ఎక్కడయితే వుంటుందో అక్కడ ఎప్పుడూ పగలే. చీకటి అనేదే వుండదు. ఇక మా రాజ మహలులో వుండతగిన శుభమణి పైగా యీ మణి రోజుకు ఎనిమిదివేల వీశెల బంగారం కురిపిస్తుంది సుమా!

అవిగో నీ కోసం రత్నాలు నింపిన బండ్లు ఎదురు చూస్తున్నయ్" అంది నాగమాత.

"గుర్తుకు నేను మూడు రత్నాలు తీసుకెళతాను. మీ కూతురు యీ సారి వచ్చేటప్పుడు రత్నాల బండ్లను పంపండి. ఇప్పుడు తొందరగా వెళ్ళాలి. అవతల కాలం మించిపోతోంది" అన్నాడు.

"సరే నీ యిష్టం. నీవు అమ్మాయిని తలుచుకున్నపుడు ప్రత్యక్షమౌతుంది" అని చెప్పింది. నాగమాతవద్ద, క్రొత్త భార్యవద్ద, సెలవు తీసుకొని క్షణంలో రాజప్రాసాదం చేరుకున్నాడు.

మరు క్షణంలో సభలోకివచ్చి నాగమణిని మణికర్ణిక చేతి కందించాడు. కాని యీ సారికూడా నాగమణి మణికర్ణిక చేతిలో వుండలేదు. రాణి చేతులో నుంచి ఎగురుకుంటూవచ్చి నీలరదనుని దోసిలి నలంకరించింది. అతడు తెచ్చిన ముత్యాలనుచూచి ఎంతో మురిసిపోయింది విశ్వసుందరి.

ఈ సారి తను వేసుకున్న పథకం తల్లక్రిందులయింది. పైగా నాగమణికూడా తనకు దక్కకుండా పోయిందే అనుకొని మనసులోనే క్రుళ్ళి క్రుళ్ళి ఏడ్చింది. ఆ అసూయను కడుపులోనే దిగమ్రింగుకొంది.

"ఇదే ఆఖరుకోరిక. దీనితో ఆశ నిరాశ అవుతుంది. ఈ సారి సాధించటానికి వీలులేనిపని చెప్పాలి. దానితో ఏ రాక్షసి నోట్లోనో గుటుక్కుమంటాడు. అంతటితో నా కోర్కె ఫలిస్తుంది విశ్వసుందరి నా తమ్ముడి పెండ్లామవుతుంది" అని దీర్ఘంగా యోచించింది.

"నీవీ రెండు వస్తువుల్నీ ఘనంగా సాధించి విజయుడవైనందుకు నా అభినందనాలు. ఐతే నా చివరి ప్రశ్న విను. ఇక్కడికి నూటిగాపోతే రాబందుల గుంపొకటి కనిపిస్తుంది. రాబందుల రాజును రత్నాంగుళీయం సాధించటానికి మార్గమేది అని అడిగితే చెపుతుంది. పో! యీ మూడవ వస్తువును సాధించి తెచ్చావో విశ్వసుందరి నీ భార్య అవుతుంది. సాధించలేకపోయావో ఆమె నీ పాలిటి మృత్యుదేవత అవుతుంది. జాగ్రత్తగా యోచించుకొని ముందడుగు వేయటం మంచిది" అని ఓ విషపు నవ్వు పారేసింది.

అయినా భువనసుందర్ ఆ విషజడుపులకు భయపడలేదు. నిర్భయంగా నవ్వున్నాడు.

"సరే కాలయాపన ఎందుకూ మీ చివరి రత్నాంగుళీయం సాధిస్తాను. సెలవిప్పించండి" అని బయలుదేరాడు నిర్భయంగా భువనసుందర్.

(సశేషము)

ఏజంట్లు కావాలి!

రాజమహేంద్రవరం, విశాఖపట్టణము, విజయనగరము, అనంతపురం, కాకినాడ, హైదరాబాదు, సికిందరాబాదు—యింకా యితర ప్రదేశాలలో మా పత్రికలు అమ్మబడని చోట్లలో తమ స్వంత బాధ్యతపై అమ్ముటకు – ఏజంట్లుగా నున్నవారికి రూ. 100/-కు రూ. 20/-లు. కమీషను, ఒక ఫ్రీకాపీ యివ్వబడును.

అడ్వర్టైజుమెంటులను కాన్వాస్ చేయువారికి మంచి కమీషను సదుపాయముల నివ్వగలము.

వివరములకు:

గృహలక్ష్మి కార్యాలయం
రాయపేట, మద్రాసు-14